క్లుప్తంగా

సమ్మెకు సహకరించాలి

ఎదులాపురం: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఫిబ్రవరి 16న నిర్వహించే భారత్‌బంద్‌లో ఎండీఎం కార్మికులు పాల్గొననున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఏడీ నర్సింలుకు సోమవారం ఎండీఎం కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. సమ్మెకు సహకరించాలని కోరారు. ఇందులో ఎండీఎం కార్మికులు లక్ష్మి, ఉషా, పుష్పలత, నాగమణి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

నేరడిగొండ: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నేరడిగొండ వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ అన్నారు. మండల కేంద్రంలో ప్రతీ సంవత్సరం ఐపీఎల్ తరహా నిర్వహించే సర్పంచ్ కప్–2 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం ఇండియన్ బ్లేజర్స్ టీమ్ జెర్సీని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, మహేందర్, పవన్, లఖన్, దినేష్, శేఖర్, హరీష్, ప్రశాంత్, జీవన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలుడికి పెన్షన్ మంజూరు చేయాలి

కైలాస్‌నగర్: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాలుడికి పెన్షన్‌ను మంజూరు చేయాలని కాంగ్రెస్ యువజన విభాగం అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి కోరారు. సోమవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన వేముల రాజన్న, స్వప్న దంపతుల కుమారుడు బన్నీ పుట్టిన ఏడాదికే కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. ప్రతీ నెల వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లాల్సి ఉండడంతో ఆ కుటుంబానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందని తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకునేలా పెన్షన్‌ను మంజూరు చేయడంతో పాటు ఆర్థిక సాయమందించేలా చూడాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ త్వరలోనే ఖాళీ అవ్వడం ఖాయమని కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి బాయిన్‌వార్ గంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న సన్నిహితుడు పోతారెడ్డిలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, నాయకులు దుర్గం రాజేశ్వర్, వెంకట్ రెడ్డి, ముడుపు దామోదర్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంవో సెక్రెటరీని కలిసిన ఎమ్మెల్యే

ఆదిలాబాద్: సీఎంవో సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సోమవారం హైదరాబాదులో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంవో చంద్రశేఖర్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం వాసి కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సన్మానించారు. జిల్లాలోని పలు సమస్యలను సత్వరమే పరిష్కారం అయ్యేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శిని కలిసిన నాయకులు

తలమడుగు: హైదరాబాదులోని సెక్రటేరియట్‌లో రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావుని సోమవారం జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. మాజీ జెడ్పీటీసీ బాబన్న, ఆనందరావు పటేల్, రమేశ్ రెడ్డి, వెంకన్న యాదవ్, దివ్య మాధవ్, కమలాకర్, ప్రకాష్ రావు, నారాయణ ఉన్నారు.

ఉద్యోగం సాధించిన యువతకు సన్మానం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని వాఘాపూర్ గ్రామానికి చెందిన భూపెల్లి వసంత రాణికి స్టాఫ్ నర్సుగా ఉద్యోగం రావడంతో కాంగ్రెస్ మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్ భూపెల్లి శ్రీధర్ దంపతులు ఆమెను సోమవారం ఘనంగా సత్కరించారు. ఆమె ఉద్యోగం సాధించడంపై అభినందనలు తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సురేశ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు గౌతం ఉన్నారు.

తలమడుగు: మండల కేంద్రానికి చెందిన యువకులు సాయికిరణ్, పవన్ కల్యాణ్, రాజేష్ రెడ్డి నర్సింగ్‌లో ఉద్యోగం సాధించడంతో పలువురు వారిని ఘనంగా సన్మానించారు. యువతకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అభిరామ్ రెడ్డి, పద్మకర్ రెడ్డి, ఆసం రవి, గంగన్న పాల్గొన్నారు.

యువకుడిపై అట్రాసిటీ కేసు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన యువకుడు రాకేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు. లక్కారం జిల్లా పరిషత్ భవనంలోకి సామగ్రిని తరలిస్తున్న క్రమంలో రాకేశ్ అనే యువకుడు పిల్లలతో సామగ్రిని ఎందుకు మోయిస్తున్నావని ఉపాధ్యాయుడిని దూషించి దాడికి యత్నించాడు. ఉపాధ్యాయుడి ఫిర్యాదు మేరకు సోమవారం డీఎస్పీ నాగేందర్ పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించి రాకేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలపై చర్చ జరిగేనా?

- నేడు 'భీంపూర్' సర్వసభ్య సమావేశం
- ప్రతిసారి మొక్కుబడిగా నిర్వహణ
- గైర్హాజరవుతున్న పలు శాఖల అధికారులు
- సర్పంచులకు ఇదే చివరి సమావేశం



భీంపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయం

తాంసి: మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చొరవ చూపే మండల సర్వసభ్య సమావేశం ప్రతిసారి నామమాత్రంగా కొనసాగుతుంది. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశం సమస్యలపై చర్చలు లేకుండానే ముగుస్తుంది. ఈసారైనా మండల సర్వసభ్య సమావేశం పూర్తిస్థాయిలో నిర్వహించి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. నూతనంగా ఏర్పడిన భీంపూర్ మండలంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నేడు జరిగే మండల సమావేశంలోనైనా ప్రజాప్రతినిధులు అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు.

గత సమావేశాలకు అధికారుల గైర్హాజరు..

గతంలో మండల కేంద్రంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి పలుశాఖల అధికారులు గైర్హాజయ్యారు. సమావేశానికి ప్రగతి నివేదికలను సైతం ఇవ్వలేదు. సమావేశానికి 17 శాఖల అధికారులు హాజరు కావాల్సి ఉండగా.. సగానికి పైగా శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ఐటీడీఏ, వసతిగృహ, రోడ్లు భవనాలు, రవాణా, ఐకేపీ, పంచాయతీ రాజ్, ఉద్యానశాఖ, ఐకేపీ అధికారులు హాజరుకాకపోగా ప్రగతి నివేదికలను సైతం అందించ లేదు. దీంతో అభివృద్ధి, సంక్షేమ పనులు ఎంతమేర జరిగాయనే తెలియని పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖల నుంచి చేపడుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులపై సమాచారం లేదని సభ్యులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదే చివరి సమావేశం..

గత ఐదేళ్లుగా గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన సర్పంచుల పదవీకాలం వచ్చే ఫిబ్రవరి 1న ముగియనుంది. కాబట్టి సర్పంచ్‌లకు ఇదే చివరి సర్వసభ్య సమావేశం కానుంది. ఐదేళ్లుగా గ్రామాల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అధికారులను సమన్వయం చేసుకొని పనులు చేపట్టారు. తమ గ్రామాల సమస్యలను చివరి సమావేశంలో సర్పంచ్‌లు ఏ మేరకు ప్రస్తావిస్తారో వేచి చూడాలి.

ప్రధాన సమస్యలు..

- మండలంలో ప్రధానంగా అంతరాష్ట్ర రోడ్డు అధ్వాన్నంగా మారింది. ధనోర నుంచి కరంజి(టి) వరకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరైనా.. పనులు ప్రారంభించలేదు. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి.
- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేక అద్దె భవనంలో గత ఏడేళ్లుగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థలం కేటాయించినా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు కాలేదు.
- మూడేళ్లుగా కేజీబీవీ భవన నిర్మాణ పనులు పూర్తి కాలేదు. భవన నిర్మాణం లేక పూర్తికాక జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో కొనసాగుతోంది.
- ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారు. జూనియర్ కళాశాల కోసం గత సమావేశంలో తీర్మానం చేపట్టి మండల కేంద్రంలో సర్పంచ్ స్థలం సైతం కేటాయించారు. కళాశాల మంజూరుకు ఒత్తిడి తీసుకురావాలి.
- పలు గ్రామాలకు పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాక నీటి కోసం చేతిపంపులు, వాగులపై ఆధారపడుతున్నారు.
- మండల పశువైద్య కేంద్రం మండల కేంద్రంలో కాకుండా సరిహద్దున ఉన్న కరంజి(టి)లో ఉండడంతో పశువైద్య సేవలు అందడం లేదు.
- భీంపూర్ పరిధిలోని పలు గ్రామాలు తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉండడంతో రోగులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. భీంపూర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోకి మార్చాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా.. నేటి వరకు మారలేదు.
- మండలంలోని గొల్లఘాట్, గుబిడి, కొజ్జన్‌గూడ, రాంపూర్, రాజుల్‌వాడీ గ్రామాలకు మట్టి రోడ్డు సరిగా లేక అవస్థలు పడుతున్నారు.
- పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. బస్సు సౌకర్యం ప్రతీ గ్రామానికి కల్పించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లి బస్సు సర్వీస్‌లను నడిపేలా చూడాలి.
- మనఊరు.. మనబడి పనులు పలు పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆయా పాఠశాలల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పనులు త్వరగా పూర్తి చేసే విధంగా అధికారుల చర్యలు తీసుకునేలా సమావేశంలో చర్చించాలి.

ఉపాధి అవకతవకలపై రచ్చ

- ప్రజావేదికలో వివరాలు వెల్లడించిన సామాజిక తనిఖీ సిబ్బంది
- సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎంపీపీ, జెడ్పీటీసీ



సిబ్బందిని నిలదీస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

గుడిహత్నూర్: మండలంలో 2022– 23 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై వారం రోజులుగా గ్రామాల్లో చేపట్టిన సామాజిక వివరాలను సోమవారం ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.4 కోట్ల 39 లక్షల విలువ గల 634 పనులకు తనిఖీ నిర్వహించినట్లు సామాజిక తనిఖీ ఎస్టీఎం నరేందర్ తెలిపారు. ఎస్సార్పీ కొమురయ్యతో పాటు 13 మంది డీఆర్పీలతో తనిఖీ చేయడం జరిగిందన్నారు. కాగా ప్రజావేదికలో ఎంపీపీ భరత్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్‌లు సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాజిక తనిఖీలో అవకవతకలు జరిగాయని బాధ్యులపై రూ.లక్షల్లో రికవరీతో పాటు సస్పెండ్ చేసినా తిరిగి యథావిధిగా విధులు ఎందుకు నిర్వర్తిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా వివిధ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు సభా వేదికలో వెల్లడించారు. ముత్నూర్‌తండా, గుడిహత్నూర్, మన్నూర్, తోషం గ్రామాల్లో మృతి చెందిన వారు, ఆశ వర్కర్లు, పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ల పేరున కూలీ డబ్బులు వేసి ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. వీరిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని డీఆర్‌డీవో అడిషనల్ పీడీ రవీందర్ రాథోడ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి అరుణ, అసిస్టెంట్ పీడీ కృష్ణారావ్, బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ వీణ, సర్పంచ్‌లు జాదవ్ సునీతా రమేశ్, తిరుమల్ గౌడ్, ఎంపీటీసీ షగీర్, ఈసీ చిత్ర, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నర్సారెడ్డి మృతి కాంగ్రెస్‌కు తీరనిలోటు



నివాళులర్పిస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పి.నర్సారెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని నర్సారెడ్డి పెద్ద కుమారుడు డాక్టర్ సుదర్శన్‌రెడ్డి నివాసానికి వెళ్లిన ఆయన నర్సారెడ్డి చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీకి ఆయన చేసన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పిప్పల్‌కోటి మాజీ సర్పంచ్ రమేశ్, కల్లెం శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

నర్సారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పి.నర్సారెడ్డి అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ వైకుంఠ మహాప్రస్థానంలో నిర్వహించారు. తలమడుగు జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాలురి గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బొల్లారం బాబన్న, కల్యాణం రాజేశ్వర్, ప్రకాష్ రావు, దేరా కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, కమలాకర్, మాధవ్, రమేశ్ అంత్యక్రియలో పాల్గొని ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయాలి'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఎదులాపురం: బీఆర్‌ఎస్‌ను గ్రామ, పట్టణస్థాయిలో బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం గ్రామ, పట్టణ ప్రధానఅనుబంధ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో కాంగ్రెస్ ఉనికిలేకుండా పోయిందని, తెలంగాణలో సైతం కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టులేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ప్రజల పక్షాన నిలిచి ప్రతిపక్ష హోదాను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, పట్టణ అధ్యక్షుడు అజయ్, బీసీ సెల్ అధ్యక్షుడు రమేశ్, మైనార్టీ అధ్యక్షుడు సలీం పాషా, యువజన నాయకులు శివ, రాజు, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

సిరికొండ: మహిళలు చట్టాలు, హక్కుల గురించి తెలుసుకోవాలని మహిళ శిశు సంక్షేమ శాఖ సభ్యురాలు కృష్ణవేణి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మసాగర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో మహిళా సాధికారత, హక్కులు, చట్టాలు, గృహ హింస చట్టం, హెల్ప్‌లైన్ గురించి వివరించారు. కార్యక్రమంలో అక్షరాస్యత నిపుణుడు నిఖిల్, కోటేశ్వర్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ

బోథ్: కాంగ్రెస్ అధిష్టానం అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించారు. కార్యక్రమంలో మల్లే పూల సత్యనారాయణ, అబూద్, మహమ్మద్, షకీర్, ప్రేమ్, సుమేర్, మున్సిఫ్, జునైత్, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఎస్సీకాలనీ నుంచి కస్తూరిబా పాఠశాల వరకు రూ. 2 లక్షల 80 వేలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు సోమవారం ఎంపీపీ ప్రీతంరెడ్డి భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. ఎంపీపీ నిధులు నుంచి పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోక శిరీష్ రెడ్డి, ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు షూ పంపిణీ

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ పాఠశాలకు చెందిన హాకీ క్రీడాకారులకు పట్టణ ప్రముఖ వైద్యులు సంజయ్ గుజరాతి సోమవారం షూ అందజేశారు. ఇందులో ఆయన సతీమణి లీనా గుజరాతి, జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, ప్రధానోపాధ్యాయుడు నారాయణ, జీఎస్‌ఆర్ ట్రావెల్ యజమాని ప్రమోద్‌కుమార్ ఖత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

బోథ్: మండలంలోని సోనాల గ్రామానికి చెందిన సక్కర్వాల్ రాదేశ్యాం ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈమేరకు బోథ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బోథ్ ఎస్సై రాము సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను సేకరించి ఫోన్ గుర్తించారు. సోమవారం సక్కర్వాల్‌కు సెల్‌ఫోన్ అందజేశాడు.

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం

ఉట్నూర్‌రూరల్: పేదల ఆకలిని తీర్చడమే బొజ్జన్న బువ్వ ముఖ్య ఉద్దేశమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట గిరిజనులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు మాజీద్, ఫయీం, యూసూఫ్ పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ ఆదివాసీకే ఇవ్వాలి



మాట్లాడుతున్న సిడాం రాంకిషన్

ఎదులాపురం: బీజేపీ ఎంపీ టికెట్ ఆదివాసీ వ్యక్తికే ఇవ్వాలని బీజేపీ ఆదివాసీ నాయకులు సిడాం రాంకిషన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. బీజేపీ ఎంపీ టికెట్ సీనియర్ ఆదివాసీ నాయకులకు కాకుండా, డబ్బు అహంకారంతో ఆరఆర్భాటం చేస్తున్న కొత్తగా బీజేపీలో చేరిన లంబాడా వ్యక్తికి ఇస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఒకవేళ అదే జరిగితే బీజేపీకి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచులది కీలక పాత్ర



మాట్లాడుతున్న ఎంపీపీ ప్రీతంరెడ్డి

ఇచ్చోడ: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామం పచ్చని చెట్లతో కళకళాడుతుందన్నారు. మండల అభివృద్ధికి భవిష్యత్‌లో మరింత సహకారం అందించాలని కోరారు. ఎంపీడీవో రాంప్రసాద్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల కాలంలో సర్పంచులు వంద శాతం ప్రభుత్వ పథకాల అమలులో సర్పంచుల కృషి ఉందన్నారు. శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, చెట్ల పెంపకంలో వారి చూపిన ప్రత్యేక చొరవ అభినందనీయమన్నారు. ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సుభాష్ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల కాలంలో మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి బాటలో నడిపించారని కొనియాడారు. సమావేశం అనంతరం సర్పంచులను శాలువాతో సత్కరించారు.

అధికారులు డుమ్మా..

మండల సర్వసభ్య సమావేశానికి అటవీశాఖ, ఎక్సైజ్, విద్యుత్, ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ, మార్కెటింగ్ శాఖల అధికారులు గైర్హాజరు కావడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకునే విధంగా జిల్లా కలెక్టర్‌కు సిఫారసు చేయాలని తీర్మానించారు. సమావేశంలో తహసీల్దార్ తుకారాం, ఎంఈవో ఉదయ్‌రావు, సీడీపీవో సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

నార్నూర్: లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు అడ శ్రీరాం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చెందిన 11 కులాలను ఎస్టీ జాబితాలో కలుపుతూ చేసిన అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నెంబర్ 3 యథావిధిగా కొనసాగించాలని, షెడ్యూల్ ప్రాంతంలో ఐటీడీఏ ద్వారా స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించాలన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మాజీక్ రావు, మండల ఉపాధ్యక్షుడు ఆత్రం పరమేశ్వర్, మెస్రం రూప్‌దేవ్, పూసం ఈశ్రు పాల్గొన్నారు.

హీరాసుక జయంతికి తరలిరండి



సన్మానిస్తున్న పర్ధాన్ సమాజ్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: ఫిబ్రవరి 26న ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కుల గురువు హీరాసుక జయంతికి ఆదివాసీ పర్ధాన్ సమాజ్ కులస్తులు పెద్ద ఎత్తున తరలి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. జయంతికి జనాలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు.

డాక్టరేట్ పట్టా గ్రహీతకు సన్మానం

ఆదివాసీ పర్ధాన్ సమాజ్‌కు చెందిన గేడం ప్రవీణ్ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి హిందీ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందడంతో ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు శాలువాతో సన్మానించారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి ఎదుగాలని ఆకాంక్షించారు.

బేల: మండలంలోని కాంఘర్‌పూర్ గ్రామానికి చెందిన గేడం ప్రవీణ్ ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన సందర్భంగా సోమవారం ఆయనను మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కన్నం మోహన్‌బాబు, ప్రముఖ తెలుగు పండితుడు ఉదారి నారాయణ, కీర్తన కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్‌రావు, అధ్యాపకులు అమోల్, క్రిష్ణరెడ్డి, సాగర్, బిందు, పుష్ప, సౌందర్య, విజయ, ప్రియాంక పాల్గొన్నారు.

అర్లి(టి)లో ప్రత్యేక వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

తాంసి: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో భీంపూర్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. నాలుగు రోజులుగా చలి తీవ్రత జిల్లాలోనే అధికంగా నమోదు అవుతుండడంతో వైద్యాధికారి నిఖిల్ రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. వారికి అవసరమైన మందులు పంపిణీ చేశారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వైద్య సిబ్బందిని, ఆశ కార్యకర్తలను సంప్రదించి వైద్య సేవలను పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణధికారి జ్ఞానేశ్వర్, సూపర్ వైజర్ గంగాధర్, ఏఎన్‌ఎం నఫీసా, భాగ్యవతి, హెల్త్ అసిస్టెంట్ విష్ణు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఏఎంబీ(ఎనీమియా ముక్త్ భారత్) కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు రాజమణి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, ఎనిమిది మంది విద్యార్థినులకు రక్తహీనత ఉందని గుర్తించారు. ఏఎన్‌ఎం సునీత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలాజీ కాంబ్లే, ఏజీఎంసీకే వెంకట రమణ, ఉదయ్ కుమార్, నరేశ్, సుజాత, జ్వలేందర్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు రక్తహీనత పరీక్షలు

గుడిహత్నూర్: స్థానిక ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థినులకు ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా రక్తహీనత పరీక్షలను వైద్యాధికారులు నరేందర్, సుజాత నిర్వహించారు. రక్తహీనత ఉన్న విద్యార్థినులకు ఐరన్ మాత్రలు అందజేశారు. ఆకు కూరలతో పాటు పాలు, గుడ్లు ఆహారంలో తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివాజీ, ఆశ వర్కర్లు సుకన్య, సత్యశీల, తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం



నర్సోజి



ఖురోసి

ఆదిలాబాద్‌రూరల్: ఆరె కటిక అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం జిల్లా కేంద్రంలోని ఓల్డ్ బస్టాండ్ ప్రాంతంలోని సంఘం భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జమీల్ ఖురోసి, అధ్యక్షుడిగా మురార్‌కర్ నర్సోజి, ప్రధాన కార్యదర్శిగా జాకీర్ ఖురోసి, ఉపాధ్యక్షుడిగా మురార్‌కర్ సుభాష్, జాయింట్ సెక్రెటరీగా అబ్దుల్ ఖలీల్, కోశాధికారిగా మసూద్ ఆహ్మద్, సభ్యులుగా షబీర్, నజీర్, సమీర్, రాజు, శీను, సజ్జులను ఎన్నుకున్నారు. కులస్తుల సమస్యల పరిష్కరం కోసం తమ వంతుగా కృషి చేస్తామన్నారు.

కొలాం గిరిజన సంఘం

ఇంద్రవెల్లి: ఆదిమ కొలాం గిరిజన కార్యవర్గాన్ని సోమవారం మండలంలోని మర్కగూడలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కొడప భీంరావ్, ప్రధాన కార్యదర్శిగా సిడాం తుకారం, ఉపాధ్యక్షుడిగా కొడప లక్ష్మణ్, సంయుక్త కార్యదర్శిగా ఆత్రం తుకారం, సహాయ కార్యదర్శిగా ఆత్రం రాజవేణు, కోశాధికారిగా టేకం భీంరావ్, సంస్కృతిక కార్యదర్శులు మడావి జంగు, కుంర కొండురావ్, సమాచార కార్యదర్శులుగా మడావి రాజు, కుంర రాజేశ్వర్, సలహాదారులుగా మడావి లేతు, కొడప ధర్మరావ్, మడావి భీంరావ్, మడావి సోనేరావ్, సభ్యులుగా మడావి కాంతబాయి, కుంర బాపురావ్, కుంర హన్మంత్‌రావ్, జంగు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.